క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ పత్రం అందిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మం వన్‌టౌన్: ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి సిఫారసుతో కారేపల్లి మండలం పేరుపల్లి గ్రామానికి చెందిన పల్లపు వెంకటేశ్వర్లు వైద్య చికిత్స కోసం సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. ఇటీవల కేన్సర్ బాధితుడి కుటుంబసభ్యులు ఎంపీని కలిసి వేడుకోగా.. ఎల్‌ఓసీ మంజూరైంది. ఈమేరకు మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో బాధితుడి కుటుంబసభ్యులకు మంజూరు పత్రాన్ని ఎంపీ అందజేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మం మయూరిసెంటర్: నగరంలోని 58వ డివిజన్ రాపర్తినగర్–2 వివేకానందనగర్, దొరన్న కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం మేయర్ పునుకొల్లు నీరజ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా, నగర ప్రజల అవసరాలకనుగుణంగాడివిజన్లలో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శెట్టి రంగారావు, సోమిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, నాంపల్లి శంకరయ్య, బేబీ, పబ్లిక్ హెల్త్ డీఈ నవీన్‌కుమార్, అనిత, మున్సిపల్ ఏఈ వలి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

సీఐకు శుభాకాంక్షలు

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండలం భారత రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఫౌండర్ సయ్యద్ సాధిక్ అలీ ఆధ్వర్యాన మంగళవారం కూసుమంచి సీఐ జనార్థన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ముస్లిం మైనార్టీ బాధ్యులు ఎస్‌డీ.సైదా, సయ్యద్ బషీర్, షేక్.సుభాని, షేక్.బాబు, షేక్.మన్సూర్, మసీద్ సదర్, ఎస్‌డీ.సైదా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేయాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న డబుల్ బెడ్‌రూం వాసులు

ఖమ్మం మామిళ్లగూడెం: మల్లెమడుగు డబుల్ బెడ్‌రూంకు వెళ్లేలా రోడ్డు వేయాలని డిమాండ్ చేస్తూ 'డబుల్'వాసులు మంగళవారం డంపింగ్ యార్డు వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ కౌన్సిల్ సభ్యుడు, డబుల్ బెడ్‌రూం ప్రెసిడెంట్ బోడ వీరన్న మాట్లాడుతూ.. ఇళ్లకు వెళ్లేందుకు ఇబ్బందిగా మారిందన్నారు. దీంతో అధికారులు మూడు రోజుల్లో రోడ్డు మొదలుపెడతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా సీపీఐ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి వర్మ జయంతి నిర్వహించాలని వినతి

తిరుమలాయపాలెం: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతూ ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యాన మంగళవారం తహసీల్దార్ విల్సన్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంతోమంది విద్యార్థులకు విద్యనందించిన ఆయన విగ్రహాన్ని తిరుమలాయపాలెంలో ఏర్పాటు చేయాలని వినతిలో పేర్కొన్నారు. ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ మండడి ఇజ్రాయిల్, రామారావు, రవి, బాబు, ఉపేందర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	18	బచ్చలికూర	4
వంకాయ	20		20
బెండకాయ	26	పాలకూర	4
పచ్చిమిర్చి	30		20
కాకర	56	చుక్కకూర	3
బీర	46		20
దొండ	24	తోటకూర	4
పొట్లకాయ	40		20
చిక్కుడు	86	గోంగూర	4
గోరుచిక్కుడు	50		20
క్యాబేజీ	20	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	40		20
ఆలుగడ్డ	26	కొత్తిమీర	1
చామగడ్డ	40		30
క్యారెట్	40	పుదీన	1
క్యాప్సికం	66		20
బీట్‌రూట్	30	-ఖమ్మం వ్యవసాయం	

కంట్రోల్ చేయలేక..

నేలకొండపల్లి రేషన్ దుకాణంలో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం



గతంలో ప్రభుత్వం పేదలకు రాయితీపై దొడ్డు రకం బియ్యాన్ని అందించేది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి దొడ్డు రకం బియ్యాన్ని నిలిపేసి సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తోంది. అయితే గతంలో రేషన్ దుకాణాలకు పంపిణీ చేసిన దొడ్డు రకం పలు చోట్ల మిగిలిపోవడంతో.. పంపిణీ చేసే సమయాన డీలర్లకు నిందలు తప్పడం లేదు. దొడ్డు రకం, సన్నాలు రెండింటిని కలిపి పంపిణీ చేస్తున్నారనే అనుమానాలు లబ్ధిదారుల నుంచి వ్యక్తమవుతున్నాయి. అసలే వానాకాలం రాకతో అటు పురుగు పడుతున్న బియ్యాన్ని నిల్వ చేయలేక.. ఇటు నిందలు మోయలేక డీలర్లకు తిప్పలు తప్పడం లేదు.

– నేలకొండపల్లి

రేషన్ దుకాణాల్లో మూలుగుతున్న దొడ్డు బియ్యం

- గోదాంలకు తరలించకుంటే పాడయ్యే అవకాశం
- పురుగు పడుతుండడంతో డీలర్ల సతమతం
- మూడు నెలలుగా తరలించని వైనం
- ప్రభుత్వ ఆదేశాలే తరువాయి..

డీలర్ల అవస్థలు..

ఇదిలా ఉండగా డీలర్లు దుకాణాలు ఇరుకుగా ఉండడంతో పాత, కొత్త నిల్వలను ఉంచేందుకు అవస్థలు పడుతున్నారు. వర్షాలకు తడిసిపోతాయని, పురుగు వస్తుందని డీలర్ల కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. వీటిని ఏం చేయాలనే దానిపై స్పష్టత లేకపోవడంతో గత మూడు నెలలుగా ఎక్కడి బియ్యాన్ని అక్కడే ఉంచుతున్నారు. కాగా, ప్రస్తుతం మూడు నెలలకు సంబంధించిన సన్న బియ్యాన్ని పంపించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ బియ్యాన్ని ఎక్కడ దించుకోవాలి.. ఉన్న స్టాక్‌ను ఏం చేయాలో అర్థం కాక డీలర్లు తలలు పట్టుకుంటున్నారు. ఈక్రమంలో నేలకొండపల్లి మండల లెవల్ స్టాక్ పాయింట్‌లో బియ్యం పరిస్థితి అధ్వానంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి దొడ్డు బియ్యం తరలింపులో స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

లబ్ధిదారుల అనుమానాలు..

రేషన్ దుకాణాల్లో దొడ్డు, సన్న బియ్యం నిల్వలు ఒకే చోట ఉంటున్నాయి. దీంతో రేషన్ పంపిణీ సమయాన బియ్యం పంపిణీ విషయంలో దొడ్డు బియ్యం కలిపి ఇస్తున్నారా అనే అనుమానాలు లబ్ధిదారుల నుంచి వ్యక్తమవుతున్నాయి. తమపై అనవసరంగా నిందలు మోపొద్దని డీలర్లు వాపోతున్నారు.

ఆదేశాలు రాగానే తరలిస్తాం..

దొడ్డు రకం బియ్యం నిల్వలను తరలించే విషయమే ఆదేశాలు రావాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా దొడ్డు బియ్యాన్ని భద్రపరిచేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. సన్న బియ్యం నిల్వలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించాం. ప్రభుత్వం నిర్ణయం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

– చందన్‌కుమార్, డీసీఎస్‌ఓ

1000 మెట్రిక్ టన్నుల నిల్వ..

జిల్లాలోని 21 మండలాల్లో ఉన్న 748 రేషన్ దుకాణాల్లో దాదాపు 1000 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం బియ్యం నిల్వలు ఉన్నాయి. ఆ నిల్వలు మూడు నెలలుగా రేషన్ షాపుల్లోనే మగ్గుతుండగా.. కొన్నిచోట్ల పురుగులు పట్టి ముక్కిపోతున్నాయి. సంబంధిత అధికారులు మొదట్లోనే ఎక్కడెక్కడ దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయో గుర్తించారు కానీ వాటిని తిరిగి గోదాంకు తరలించకుండా డీలర్ల వద్దనే ఉంచారు. దీంతో వాటిని ఎలా భద్రపరచలో తెలియక సతమతమవుతున్నారు. మరో వైపు మండల లెవల్ స్టాక్ పాయింట్ల వద్ద క్వింటాలు దొడ్డురకం బియ్యం మగ్గుతున్నాయి. అక్కడ లక్క పురుగు పడుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో పలు చోట్ల మండల లెవల్ స్టాక్ పాయింట్‌లు శిథిలావస్థలో ఉండగా.. వానలకు ఆ బియ్యం తడిసి పాడయ్యే అవకాశాలు ఉన్నాయి.

ఆరా తీసి.. పేర్లు ఏరేసి!

నేలకొండపల్లి: సన్న బియ్యం పంపిణీ చేస్తున్న క్రమాన అనర్హులకు తెల్లరేషన్ కారులు తొలగించే ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈనేపథ్యాన పంచాయతీ కార్యదర్శులకు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అనర్హులను గుర్తిస్తున్నారు. గతంలో లబ్ధిదారులు దొడ్డు రకం బియ్యాన్ని కొని దళారులకు అమ్మడం లేదా అసలు తీసుకోకపోవడం చేసేవారు. ఈక్రమాన ఇప్పుడు సన్న బియ్యాన్ని కూడా ఇలాగే చేస్తున్నట్లు అధికారులు గుర్తించి జాబితాలను సిద్ధం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 4.11 లక్షల రేషన్‌కార్డులకు గాను 11,48,031 మంది లబ్ధిదారులకు ప్రస్తుతం ప్రతి నెలా 73,75,868 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తుండగా.. వీరిలో అనర్హులు కూడా ఉన్నట్లు సమాచారం. పెళ్లయిన వారు, చనిపోయిన వారు, ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారినీ గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. జూన్‌లో మూడు నెలలకు సంబంధించిన బియ్యం ఒకేసారి పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో అనర్హుల పేర్లను తొలిగించటానికి అధికారులు చర్యలు చేపట్టారు. చాలా మంది బియ్యం కోసం కాకుండా ఇతర అవసరాల కోసం ధనవంతులు కూడా రేషన్ కార్డులు పొందినట్లు తెలుస్తోంది. అధికార యంత్రాంగం మరింత లోతుగా విచారిస్తే గాని మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ఇందిరమ్మ ఇళ్లు వేగంగా పూర్తి చేసుకోండి



మంజూరు పత్రాలు అందిస్తున్న చైర్మన్

నేలకొండపల్లి: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తమ ఇంటి నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు అన్నారు. మండలంలోని చెరువుమాధారం రైతు వేదిక వద్ద చెరువుమాధారం, రాయగూడెం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంగళవారం మంజూరు పత్రాలు పంపిణీ చేశాక మాట్లాడారు. అలాగే ముజ్జుగూడెం రైతు వేదికలో అనాసాగారం, గువ్వలగూడెం, ముజ్జుగూడెం గ్రామాల లబ్ధిదారులకు పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఎం.యర్రయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, నాయకులు కొడాలి గోవిందరావు, ఈవూరి శ్రీనివాసరెడ్డి, కె.నాగేశ్వరరావు, తుమ్మా ధనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు సరిపడా అందుబాటులో ఉంచాలి



ఏఈఓకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్: వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు సరిపడా అందుబాటులో ఉంచాలని సీపీఎం పాలేరు డివిజన్ నాయకుడు భూక్యా నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వ్యవసాయాధికారి కార్యాలయంలో నాయకులు అధికారులను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సకాలంలో జీలుగు, పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయాలని, వ్యవసాయ పరికరాలను తక్కువ ధరలకు అందించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. గత ఖరీఫ్‌కు సంబంధించిన రైతుబంధు డబ్బులే ఇంత వరకు అందరు రైతులకు జమకాలేదని, ఇక ఖరీఫ్ ప్రారంభమైనా రైతుబంధు ఊసేలేదన్నారు. ఈ కార్యక్రమంలో సైదులు, వినోద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోస్టూడియోల బంద్ విజయవంతం

నేలకొండపల్లి: ఫొటోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన ఫొటోస్టూడియోల బంద్ మంగళశారం విజయవంతమైంది. ఈమేరకు మండల కేంద్రంలో ఫొటో స్టూడియోలు బంద్ చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు జెర్రిపోతుల సత్యనారాయణ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానం పెరిగినా.. స్టూడియో సేవలు ధరలు మారకపోవడం వల్ల ఆర్థికంగా నష్టపోతున్నామని, వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గొలుసు ఆంజనేయులు, మండల కోశాధికారి వల్లాల ఉపేందర్, దండా సత్యనారాయణ, రామగిరి రవి, కొత్తకొండ వెంకట్, షేక్ మౌలానా తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' రద్దుకు కేంద్రం కుట్ర..



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఖమ్మంరూరల్: ఉపాధి హామీ కూలీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధి పథకాన్ని రద్దు చేయాలనే కుట్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో సరైన నిధులు కేటాయించడం లేదన్నారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు ప్రసాద్, శ్రీనివాసరావు, ఎస్.కృష్ణ, వి.సుదర్శన్‌రెడ్డి, వి.నాగేశ్వరరావు పి.సంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం..



రఘునాథపాలెం : ప్రచారజాతలో యూనియన్ నాయకులు, స్థానికులు

ఖమ్మం సహకారనగర్/రఘునాథపాలెం/కామేపల్లి: ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునేలా తల్లిదండ్రులంతా తమ పిల్లలను చేర్పించాలని టీజేఏసీ జిల్లా చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు కోరారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెంపునకు టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యాన చేపట్టిన ప్రచార జాతను మంగళవారం ఆయన ఖమ్మంలో ప్రారంభించి మాట్లాడారు. యూటీఎఫ్ మంచి కార్యక్రమం చేపట్టిందని అభినందించిన ఆయన.. బడిని నిలబెట్టుకునేలా అందరూ ముందుకు రావాలని సూచించారు. యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గాభవాని, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు, నాయకులు వెంకన్న, షమి, రాందాస్, నాగేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో జాత కొనసాగగా పీఏసీఎస్ చైర్మన్ తాత రఘురాం సంఘీభావం తెలిపారు. నాయకులు ధర్మసోత్ నాగేశ్వరరావు, పినపాక సురేష్, మన్నేపల్లి నరసింహారావు, నల్లమోతు శ్రీనివాసరావు, జక్కుల వెంకటేశ్వరరావు, సంతూలాల్, సక్రాం, సతీష్, ప్రసాద్, మంగీలాల్, శివకోటి తదితరులు పాల్గొన్నారు. అలాగే, కామేపల్లి మండలంలో జరిగిన ప్రచారంలో టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లమోతు శ్రీనివాసరావు, జక్కుల వెంకటేశ్వర్లుతో పాటు వేణు, ధర్మసోత్ నాగేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధితోనే దేశాభివృద్ధి..



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారావు

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని మాన్య శ్రీ కాన్షీరాం చేసిన వ్యాఖ్యలను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కే.వీ.కృష్ణారావు గుర్తు చేశారు. బీఎస్పీ ఖమ్మం జిల్లా కార్యాలయంలో ఖమ్మం జిల్లాలో బీసీలకు జరుగుతున్న అన్యాయంపై బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వరరావు అధ్యక్షత మంగళవారం సమావేశం నిర్వహించారు. బీసీలను ఓటర్లుగా చూస్తున్నారే తప్ప నాయకులుగా గుర్తించడం లేదని, జిల్లాలో 60 శాతం ఉన్న బీసీ కులాలకు ఏ ఒక్క పదవీ ఇవ్వడం లేదన్నారు. ఈ సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పల్లెపొంగు విజయకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల నాగరాజు, పెళ్లూరి విజయ్ కుమార్, ఆకుల గాంధీ, పసుపులేటి నాసరయ్య, పాదిల సతీష్ యాదవ్, బానోత్ బద్రు నాయక్, పొడకంటి రాంబాబు, లింగేశ్వర్, కర్నే రామారావు, బీఎస్పీ జిల్లా కార్యదర్శులు బుర్ర ఉపేందర్, దారెల్లి రమేష్, నాయకులు వంశీ, రమేష్, కోటయ్య, సతీష్, రమేష్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వన్ నేషన్- వన్ ఎలక్షన్ వర్క్‌షాప్

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రజాధనం వృథా కాకుండా ఉండాలంటే వన్ నేషన్-వన్ ఎలక్షన్‌తో సాధ్యమని బీజేపీ వన్ నేషన్-వన్ ఎలక్షన్ రాష్ట్ర కన్వీనర్ కరణం పరిణీతి అన్నారు. మంగళవారం ఖమ్మం కమాన్‌బజార్‌లో జరిగిన వర్క్ షాప్‌లో ఆమె మాట్లాడారు. ఎన్నికల కోడ్ పేరుతో ప్రభుత్వ పనులకు అవరోధాలు కలిగే అవకాశం ఉన్నందున ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా అధికార ప్రతినిధి మారుతి వీరభద్రప్రసాద్, రాష్ట్ర నాయకుడు బాదంపూడి ప్రవీణ్ మాట్లాడగా.. కార్యక్రమంలో లీగల్ సెల్ కన్వీనర్ తుమ్మ శివ, మహిళా నాయకురాలు, మందా సరస్వతి స్వర్ణ, నీలిమ తదితరులు పాలొన్నారు.

రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



అలోక్

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో అథ్లెటిక్స్ శిక్షణ పొందుతున్న పి.అలోక్ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా నుంచి ఎంపికయ్యాడు. జూన్ 1వ తేదీన సికింద్రాబాద్‌లోని జింఖాన గ్రౌండ్స్‌లో జరిగే లాంగ్‌జంప్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈమేరకు డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి, అథ్లెటిక్స్ చీఫ్ కోచ్ ఎండీ.గౌస్ తదితరులు అలోక్‌ను అభినందించారు.

చౌడాలమ్మ బోనాల జాతర



పూజలో పాల్గొన్న దయాకర్‌రెడ్డి, తదితరులు

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయిలో చౌడాలమ్మతల్లి బోనాల జాతరను మంగళవారం ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు.

దాతల ఔదార్యం

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న జగదీష్

ఖమ్మం మామిళ్లగూడెం: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రి చికిత్స పొందిన ఖమ్మం వైఎస్‌ఆర్‌నగర్‌కు చెందిన తెలంగాణ ఉద్యమ కారుడు మంచికంటి నరేష్‌కు నాయీబ్రాహ్మణ సేవా సంఘం నగర అధ్యక్షుడు యలమందల జగదీష్ మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. బీసీ సంఘ నాయకులు, నాయీబ్రాహ్మణ నగర కమిటీ, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు విరాళాల వెల్లువ



దాణా అందిస్తున్న శ్రీస్తంభాద్రి సేవా సమితి సభ్యులు

ఖమ్మం అర్బన్/ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని 14వ డివిజన్ గొల్లగూడెంలో ఉన్న ఓం శ్రీ కృష్ణ గోశాలకు పలువురు దాతలు విరాళాలు అందించారు. మంగళవారం శ్రీ స్తంభాద్రి సేవా సమితి ఆధ్వర్యాన దాతల సహకారంతో రూ.55వేల గోదాణాకు అందించగా.. గంట సాంబయ్య, హిమావతి దంపతులు రూ.18వేలతో రెండు ట్రాక్టర్ల గడ్డిని అందజేశారు. అలాగే చెరుకూరి సత్యనారాయణ రూ.6వేలతో ఒక ట్రాక్టర్ తాజా గడ్డిని, కొక్కుల వెంకటేశ్వర్లు, మాధవి దంపతులు ప్రతి నెలా రూ.5వేల చొప్పున విరాళంగా అందిస్తున్నట్లు గోశాల నిర్వాహకులు తెలిపారు.

ముందస్తు ప్రణాళికతో సిద్ధం..



అధికారులతో సమీక్షిస్తున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

- లోతట్టు ప్రాంతాల్లో రక్షణ చర్యలు
- పురావాసకేంద్రాల గుర్తింపునకు ఇన్‌చార్జ్‌ల నియామకం
- అధికారుల సమీక్షలో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా చర్యలు తీసుకునేందుకు అధికారులు ఉపక్రమించారు. గతేడాది సెప్టెంబర్‌లో వచ్చిన భారీ వర్షాలు, వరదలతో తీవ్ర నష్టం వాటిల్లినందున.. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ముందస్తు ప్రణాళికల కోసం మంగళవారం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులతో సమీక్షించారు.

గత అనుభవాలతో..

గతంలో దెబ్బతిన్న డివిజన్లు, వాటిలో చేరిన నీటి మట్టం ఇళ్లను ఎంతవరకు ప్రభావితం చేసిందనే వివరాలను చర్చించారు. ఈక్రమాన వరద ముంపు ప్రాంతాలుగా గుర్తించిన ప్రతీ డివిజన్‌కు ప్రత్యేకంగా ఇన్‌చార్జ్ అధికారులను నియమించి తగిన జాగ్రత్తలు పాటించేలా ఆదేశాలు జారీ చేశారు. ఇన్‌చార్జ్ అధికారితో పాటు వార్డ్ ఆఫీసర్, శానిటరీ సూపర్‌వైజర్‌లతో ఒక బృందం ఏర్పాటు చేసి.. వారి పరిధిలోని ప్రతి గృహాన్ని సందర్శించి గతంలో ఎలా ప్రభావితమయిందో వివరంగా డాక్యుమెంట్ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా, వరదల సమయాన ప్రజలను తాత్కాలిక ఆశ్రమం కోసం పనరావాసకేంద్రాలను ఏర్పాటు చేయడం, అందులో కనీస సౌకర్యాలైన తాగునీటి సరఫరా, విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు, కూలర్, ఆరోగ్య పరిరక్షణ వంటి అన్ని వసతులు అందుబాటులో ఉంచాలని సూచించారు. అత్యవసర సమయాన ప్రజలతో సమన్వయం కోసం ప్రతీ డివిజన్‌కు ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి, ఆ గ్రూపులో డివిజన్ కార్పొరేటర్, యువతను వలంటీర్లుగా నియమించి, వారికీ సరైన శిక్షణ ఇచ్చి, ఫస్ట్ రెస్పాన్స్ టీంలా తయారుచేయాలని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజల అత్యవసర వస్తువులు, సర్టిఫికెట్లు తడవకుండా భద్రంగా తరలించేందుకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అంతేగాక, పునరావాసకేంద్రాల సమాచారం ప్రజలకు ముందుగానే తెలియజేసి, వారు ఆ ప్రాంతానికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

కంట్రోల్‌రూమ్ ఏర్పాటు..

పునరావాసకేంద్రాల పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేకంగా శానిటరీ సూపర్‌వైజర్లు, హెవీ డ్రైవర్లు నియమించనున్నట్లు తెలిపారు. మొత్తం వ్యవస్థను ఆ డివిజన్ ఇన్‌చార్జ్ ఆఫీసర్, వార్డ్ ఆఫీసర్ పర్యవేక్షిస్తారని, ప్రతీ ఫోన్ కాల్‌కు అనుక్షణం స్పందించేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే నగరంలోని ప్రధాన డ్రెయిన్లు ఆక్రమణకు గురైతే వెంటనే వాటిని తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఏసీపీ వసుంధర నేతృత్వాన టౌన్ ప్లానింగ్ బృందం డ్రెయిన్లపై ఆక్రమణలను గుర్తించాలని ఆదేశించారు.

డివిజన్ల వారీగా వివరాలు..

- 16, 17వ డివిజన్లకు సంబంధించి పునరావాస కేంద్రాన్ని శబరి ఫంక్షన్‌హాల్, ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేశారు. డివిజన్ ఇన్‌చార్జ్‌లుగా డీఈఈ టి.శ్రీనివాస్, ఏఈ బి.వరుణ్, పునరావాస కేంద్రాల ఇన్‌చార్జ్‌లుగా డీఈఈ టి.శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎన్.ఎల్లస్వామిలను నియమించారు.
- 28, 29, 30వ డివిజన్లకు రాజేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాలను పునరావాస కేంద్రంగా కేటాయించారు. ఇన్‌చార్జ్ ఆఫీసర్లుగా ఏఈలు యాకూబ్‌అలీ, ఎస్‌డీ.షమ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.రమేష్‌లను నియమించారు.
- 34, 35, 46, 47, 48వ డివిజన్లకు పునరావాస కేంద్రాలుగా నయాబజార్ పాఠశాల, ఉమెన్స్‌కాలేజీ, స్వర్ణభారతి కల్యాణ మండపాలను కేటాయించారు. ఇన్‌చార్జ్ అధికారులుగా ఏఈఈ యాకూబ్, డీఈఈ జ్యోతి, టీపీజో తేజ, టీపీఎస్ సంతోష్‌లను నియమించారు.
- 59, 60వ డివిజన్లకు రామన్నపేట పాఠశాల, ఫంక్షన్‌హాల్‌లను పునరావాస కేంద్రాలుగా కేటాయించారు. ఇన్‌చార్జ్ ఆఫీసర్లుగా డీఈఈ ధరణికుమార్, ఏఈ నరేంద్రతేజలను నియమించారు.